



# జనమే.. జనం

ఖైరతాబాద్‌లో కొలువుదీరిన శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. శనివారం ఉదయం 6గంటల నుంచే భక్తులు తరలిరాగా, సాయంత్రానికి రెట్టింపు సంఖ్యలో వచ్చారు. ఖైరతాబాద్ ఎంఎంటీఎస్, మెట్రో స్టేషన్, బస్టాండ్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. శనివారం రాత్రి వరకు సుమారు 4లక్షలపైగా భక్తులు దర్శించుకున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. - ఖైరతాబాద్, సెప్టెంబర్ 14





యంగ్ లీడర్స్ ఫర్ సోషల్ ఛేంజ్ ప్రోగ్రాం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

## 'యంగ్ లీడర్స్ ఫర్ సోషల్ ఛేంజ్' ప్రోగ్రాం

కొండాపూర్, సెప్టెంబర్ 14 : నేటి యువతలో సామాజిక స్పృహను నింపుతూ, దేశ రాజకీయాలు, సమాజ సేవలో వారి ప్రాతినిధ్యాన్ని పెంపొందించేందుకు ది డెమోక్రటిక్ సంఘం ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నాలెడ్జ్ సిటీలోని టీ – హబ్‌లో 'యంగ్ లీడర్స్ ఫర్ సోషల్ ఛేంజ్ ప్రోగ్రాం'ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గరెత్ వైన్ ఓవెన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక స్పృహను పెంపొందించేలా విద్యా విధానాల్లో మార్పు రావాలన్నారు. ఎంపికైన పలువురు విద్యార్థులకు దేశ పార్లమెంట్‌తో పాటు పలువురు ఎంపీలతో అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ట్రస్ట్ ఫౌండర్ చైతన్య ఎంఆర్ఎస్‌కే తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ లావ శ్రీకృష్ణ దేవరాయలు, నటీ రెజీనా కాసెండ్రాలతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం





రాజాకు జ్ఞాపికను అందజేస్తున్న వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ జయకర్ డేనియల్

మారేడ్‌పల్లి, సెప్టెంబర్ 14: రక్తదానం ప్రాణదానంతో సమానమని సినీ నటుడు రాజా, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ వైఎంసీఏ 180 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వైఎంసీఏ, లయన్స్ క్లబ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ వైఎంసీఏ హాల్ లో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సినీ నటుడు రాజా , ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సినీ నటుడు రాజా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. వైఎంసీఏ 180 ఏళ్లు పూర్తయిన సందర్భంగా తలసీమియా, హెచ్ఐవీ రోగులకు సేకరించిన రక్తాన్ని అందిస్తామని వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ జయకర్ డేనియల్ తెలిపారు. కార్యక్రమంలో సైబరాబాద్ డీసీసీ కరుణాకర్, టీఎస్ఐఐసీ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, కస్టమ్స్ అధికారి ప్రసన్న కుమార్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు స్వర్ణలత, వైఎంసీఏ ప్రతినిధులు లేనార్డ్, కెన్నెత్, జవహర్ కెనెడి, జాన్సన్ డేవిడ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ మెడికల్ కళాశాల వార్షికోత్సవం



వైద్య కళాశాల పూర్వ విద్యార్థులను సన్మానించిన ఆలుమ్ని అసోసియేషన్

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 14 : సికింద్రాబాద్‌లోని గాంధీ వైద్య కళాశాల 70వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. గాంధీ ఆలుమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రాజా రెడ్డి, గాంధీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆలుమ్ని అసోసియేషన్ చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలను, వైద్య విద్యార్థులను ప్రోత్సహిస్తున్న కార్యక్రమాలను ప్రస్తుత అధ్యక్షుడు డాక్టర్ లింగమూర్తి వివరించారు. ప్రతిభ గల విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను, ఉచితంగా పుస్తకాలను అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వైద్య రంగంతో పాటు వివిధ రంగాల్లో రాణిస్తున్న పూర్వ విద్యార్థులైన డాక్టర్ రాజారెడ్డి, డాక్టర్ ముత్యం రెడ్డి (1964), డాక్టర్ ప్రతాప్‌రెడ్డి (1967), పద్మశ్రీ డాక్టర్ సాయిబాబా గౌడ్, డాక్టర్ సురేంద్ర (రచయిత), డాక్టర్ రాములు (కవి), డాక్టర్ సుశీల (ఐఏఎస్), డాక్టర్ గాంధీ (ఐఆర్ఎస్) లను ఘనంగా సన్మానించారు. అనంతరం 40 మంది వైద్య విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలుమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ లింగమూర్తి, కార్యదర్శి డాక్టర్ వెంకటరత్నం, సభ్యులు పాల్గొన్నారు.

# ఉత్తమ్‌కుమార్ రెడ్డి కమిటీని రద్దు చేయాలి



ఉదిత్ రాజ్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న మాల మహానాడు జాతీయ అధ్య క్షుడు రాంమూర్తి

సుల్తాన్‌బజార్,సెప్టెంబర్ 14. ఎస్సీ వర్గీకరణపై ఉత్తమ్‌కుమార్ రెడ్డి కమిటీని రద్దు చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పసుల రాంమూర్తి కోరారు. శనివారం ఢిల్లీ అక్బర్ రోడ్డులోని ఏఐసీసీ కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అసంఘటిత ఉద్యోగ జాతీయ చైర్మన్ డాక్టర్ ఉదిత్ రాజ్‌ను మాల మహానాడు ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్‌తో కలిసి ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును రద్దు చేయించాలని అన్నారు. దేశంలోని ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకోని నిర్ణయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకోవడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఉత్తమ్‌కుమార్ రెడ్డి కమిటీని వెంటనే ర ద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి దీపదాస్‌కు వినతి పత్రాన్ని పంపాలని ఉదిత్‌రాజ్‌ను ఆయన కోరారు. జాతీయ యువజన ప్రధాన కార్యదర్శి మగ్గిడి దీపక్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షు రాలు ఆరె దేవకర్ణ,రాష్ట్ర మహిళా కార్యదర్శి గంట బబిత తదితరులు పాల్గొన్నారు.

### సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దహనం



సీఎం దిష్టిబొమ్మ, మంత్రుల కమిటీ ప్రతులను దహనం చేసిన కృష్ణస్వరూప్

రవీంద్రభారతి,సెప్టెంబర్14: ఎస్సీ వర్గీకరణకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన మంత్రుల కమిటీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ దళిత బహుజన పార్టీ డీబీపీ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్ రాజు ఆధ్వర్యంలో శనివారం ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను, వర్గీకరణ ప్రతులను, పీఎం నరేంద్రమోదీ చిత్ర పటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా కృష్ణస్వరూప్ మాట్లాడుతూ వర్గీకరణ కమిటీని వెంటనే రద్దు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్, పీఎం నరేంద్ర మోదీ డౌన్..డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గవ్వల శ్రీకాంత్, రోజాలీలా, భూలపల్లి హేమలత తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ భద్రతకు కృషి చేస్తాం



అభినందన సభలో మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

శామీర్‌పేట, సెప్టెంబర్ 14 : రెవెన్యూ శాఖలో పని చేస్తున్న కింది స్థాయి సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి సకాలంలో గౌరవ వేతనాలు అందించాలనే డిమాండ్‌లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి అన్నారు. తూంకుంట మున్సిపాలిటీలో శనివారం రెవెన్యూ శాఖ టెక్నికల్ మేనేజర్లు, టైపిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్ల ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కింది స్థాయి సిబ్బందికి రూ 10, 15 వేలు వేతనం చెల్లిస్తున్నారని ఈ జీతంతో కుటుంబాలు ఎలా సాగుతాయన్నారు. రెవెన్యూ శాఖలో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం రుణాలు ఇప్పించాలని ఫోర్త్‌సిటీలో ఇండ్లు నిర్మించుకుంటారని వీరికి ప్రభుత్వం పరిశ్రమలకు ఇచ్చే రాయితీలు ఇవ్వాలని సూచించారు. వేతనాలలో నుంచి ఈఎంఐ చెల్లించుకుంటారని తెలిపారు. రెవెన్యూ శాఖలో అధికారులు, ఉద్యోగులు అందరు ఐక్యంగా ఉంటే సమస్యలను పరిష్కరించుకోవచ్చునన్నారు.

## హిందీ పాత్రికేయులకు సమాన ప్రాతినిధ్యం




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

రవీంద్రభారతి,సెప్టెంబర్ 14: హిందీ పాత్రికేయులకు సమాన ప్రాతినిధ్యం కల్పిస్తామని, భాషా ప్రాతిపదికన వివక్ష ఉండదని ప్రెస్‌అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ హిందీ జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ హిందీ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ కొత్తతరం పిల్లలు అందరూ హిందీ మాట్లాడుతారని అన్నారు. పాత్రికేయులను భాషా ప్రాతిపదికన చూడమని , భవిష్యత్‌లో అలాంటి సంఘటనలు జరిగితే తానే ముందుంటానని చెప్పారు. హిందీ పాత్రికేయులకు ఇండ్లస్థలాలు, అక్రిడిటేషన్ , మెడికల్ ఇన్సూరెన్స్ అందేటట్లు చూసే బాధ్యత తనదేనన్నారు. త్వరలో మరో 3వేల మందికి పైగా హైదరాబాద్ జర్నలిస్టులకు ఫ్యూచర్ సిటీలో ఇండ్ల స్థలాలు ఇస్తామంటూ సీఎం ప్రకటించారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీ, తెలంగాణ హిందీ జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఎన్ఎస్.కుమార్ దక్షిణ్ సమాచార్ పత్రిక ఎడిటర్ నీరజ్‌కుమార్, వికాస్ శుక్లా, ఎం.ఎ సర్వర్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.10 లక్షల నోట్లతో అలంకరణ

*దుండిగల్,సెప్టెంబర్14: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ఈశ్వర్ విల్లాస్ గేటెడ్ కమ్యూనిటీలో శనివారం ఏకాదశి సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు వినాయకుడికి గజమాలతో పాటు కిరీటాన్ని రూ.100, 200, 500 నోట్లు పేర్చి రూ.10 లక్షలతో ప్రత్యేకంగా అలంకరించారు.*



## న్యూ అల్కాజార్ ఆవిష్కరణ





సిటీబ్యూరో, సెప్టెంబర్ 14(నమస్తే తెలంగాణ) : ప్రముఖ కారు డీలర్ కున్ యునైటెడ్ హ్యుందాయ్ నూతన మోడల్ కార్‌ను శనివారం ఆవిష్కరించింది. లక్డీకాపూల్‌లోని హ్యుందాయ్ షో రూంలో న్యూ అల్కాజార్ మోడల్‌ను హెచ్‌ఎండీఎఫ్‌సీ కారు లోన్ రీజనల్ మేనేజర్ వర్ధరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మార్కెట్లోకి విడుదల చేశారు. కొత్త వినియోగదారుడికి కారును అందజేస్తూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో హ్యుందాయ్ డీజీఎం కార్తీక్, బ్రాంచ్ హెడ్ రాఘవేందర్ రెడ్డి, మార్కెటింగ్ హెడ్ ముత్తుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో చైతన్యం పెరగాలి



ప్రముఖులకు జ్ఞాపికలను అందజేస్తున్న ప్రొ.హరగోపాల్, జేవీవీ కార్యవర్గ సభ్యులు

కాప్రా, సెప్టెంబర్ 14: జనవిజ్ఞానవేదిక 5వ రాష్ట్ర మహాసభలు ఏఎస్‌రావునగర్‌లోని అణుపురం కమ్యూనిటీహాలులో శనివారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథులుగా రిటైర్డ్ సైంటిస్టు డాక్టర్ మహతాబ్ సోహ్రాబ్ బాంజీ, ప్రొఫెసర్ హరగోపాల్, ఆంధ్రజ్యోతి సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. 'విద్యావిధానం–వక్రీకరణలు' అను అంశంపై ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ యూనివర్సిటీల స్వేచ్ఛను ప్రభుత్వాలు హర్షిస్తున్నాయని అన్నారు. విశ్వవిద్యాలయాలు, విద్య నిర్బంధంలో ఉన్నాయని, సమాజంలో సామాజిక చైతన్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో యూనివర్సిటీలకు 60శాతం కేటాయింపులు తగ్గించడం పై ఆందోళన వ్యక్తం చేశారు. సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్ 'ప్రగతికి తొలిమెట్టు ప్రశ్న' అను అంశంపై మాట్లాడుతూ సమాజ పురోగతికి ప్రశ్నే కీలకం అని, హేతువాదులు ఎదుటి వారిని ప్రశ్నించడమే కాదు తమను తాము ముందుగాప్రశ్నించుకోవాలని అని అన్నారు. ఈ కార్యక్రమంలో పోషకాహార నిపుణురాలు, విశ్రాంత డైరెక్టర్ గ్రేడ్ శాస్త్రవేత్త , జీవీవీ గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ మెహబాత్ బాంజీ, జీవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కోశాధికారి వరప్రసాద్, సెక్రటేరియేట్ సభ్యులు ఆనంద్‌కుమార్, రాజా,రమాదేవి, నాగరాజు, బురాన్, జెన్నీ, మల్లయ్యచారి, ఎండీ అండాలి పాల్గొన్నారు.

# బీసీల ఓట్లతో అధికారంలోకి అగ్రవర్ణాలు





నిరసనలో పాల్గొన్న మాజీ ఎంపీ వీహెచ్ హనుమంతరావు, విద్యార్థులు

- మంత్రి కాకుండానే రేవంత్ సీఎం అయ్యిండు
- కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్

కొండాపూర్, సెప్టెంబర్ 14 : ఒక్కసారి కూడా మంత్రి కాకుండా కేవలం నాలుగేండ్లలో ముఖ్యమంత్రిగా ఎన్నికైన రేవంత్‌రెడ్డి అదృష్టవంతుడని, ఇది నేనిప్పటి వరకు చూడలేదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ వీహెచ్ హనుమంతరావు అన్నారు. బీసీల ఓట్లతో అగ్రవర్ణాలు రాజ్యమేలుతున్నాయన్నారు. దేశ వ్యాప్తంగా ఓబీసీ కుల గణన చేపట్టాలంటూ శనివారం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి మాజీ ఐపీఎస్ పూర్ణచందర్‌రావు, మాజీ ఏఐఎస్ చిరంజీవులు, స్టూడెంట్స్ నాయకులతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఓబీసీ కుల గణన చేపట్టి ఆ అదృష్టాన్ని కూడా తమ ఖాతాలో వేసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో ఏండ్లుగా దేశాన్ని పాలించి, చేసిందేముందంటూ రాహుల్ గాంధీని ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రశ్నకు సమాధానంగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో వెంటనే ఓబీసీ కుల గణన చేపట్టి న్యాయం చేయాల్సిందిగా తెలిపారు. హైకోర్టు సైతం ప్రభుత్వాన్ని మూడు నెలల్లో కుల గణన పూర్తి చేయాలంటూ హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేశారు. పూర్ణ చందర్‌రావు మాట్లాడుతూ దేశంలో వర్ణ, కుల వ్యవస్థను పటిష్టం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. సగానికి పైగా ఉన్న బీసీలు 50 శాతం రిజర్వేషన్లకు నోచుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ విద్యార్థి సంఘాల నాయకులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## మండల్ ఆర్ట్‌తో 54 ప్రపంచ రికార్డులు





ఖైరతాబాద్, సెప్టెంబర్ 14 : మండల్ ఆర్ట్‌తో నగరానికి చెందిన ఓ నృత్యకారిణి, చిత్రకారిణి, గాయకురాలు ప్రపంచ రికార్డులు సొంతం చేసుకున్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి, జాతీయ, అంతర్జాతీయ ప్రపంచ రికార్డుల ఆర్గనైజేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ కేవీ రమణరావు, మాజీ చీఫ్ సెక్రటరీ డాక్టర్ సుబ్రహ్మణ్యం, సినీనటుడు శ్రీనివాసులు పసునూరి, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మతో కలిసి సోనాలీ ఆచార్జిని శాలువా, మెమోంటోతో సత్కరించారు. కేవీ రమణరావు మాట్లాడుతూ మండల్ ఆర్ట్‌తో సోనాలీ 54 ప్రపంచ రికార్డులు సాధించడం గొప్ప విషయమన్నారు. మండల్ ఆర్ట్‌తో వేంకటేశ్వర స్వామి చిత్రాన్ని 25 అట్టలపై 11 అడుగుల మూడు ఇంచుల ఎత్తులో 54 గంటల్లో పూర్తి చేశానని సోనాలీ తెలిపారు. ఈ సమావేశంలో సిరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెయింటింగ్ డైరెక్టర్ సిరి స్వామి, సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

# మా స్థలాలను అప్పగించండి





మాట్లాడుతున్న పద్మావతీనగర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బాధితులు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 14 : అమీన్‌పూర్‌లో కబ్జాలకు గురై ఇటీవల హైడ్రా కూల్చివేతల్లో ఆక్రమణల నుంచి విముక్తి చెందిన తమ స్థలాలను రీసర్వే చేయించి తిరిగి అప్పగించాలని బాధితులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పద్మావతీనగర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, ప్రతినిధులు సుధాకర్, తనూజ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం అమీన్‌పూర్ గ్రామానికి చెందిన సర్వే నం. 193, 194, 323, 324లోని 24 ఎకరాల భూమిని 1986లో సొసైటీ తరపున కొనుగోలు చేశామని, అప్పటి గ్రామపంచాయతీ అనుమతితో 236 ప్లాట్లు లే ఔట్‌గా చేశారని తెలిపారు. అయితే 2006లో కొందరు తమ లే ఔట్‌లోకి ప్రవేశించకుండా గోడలు నిర్మించారని, తమ స్థలాలను కబ్జా చేసి ఇతరులకు విక్రయించే ప్రయత్నం చేశారన్నారు. ఇటీవల హైడ్రా అధికారులు ఆ గోడలను కూల్చివేసి తమకు ఉపశమనం కలిగించినా కోల్పోయిన స్థలాన్ని తమకు అప్పగించలేదన్నారు. ప్రభుత్వం స్పందించి రీసర్వే చేయించి తమ స్థలాలను తిరిగి అప్పగించాలని కోరారు.

## టెక్ మహేంద్ర ఆధ్వర్యంలో శిక్షణ

అమీర్‌పేట్, ఆగస్టు 14 : టెక్ మహేంద్ర ఫౌండేషన్ తన సీఎస్ఆర్ బాధ్యతల్లో భాగంగా టెక్ మహేంద్ర స్మార్ట్ అకాడమీ (హైదరాబాద్) తరపున నిరుద్యోగ యువతకు సప్లై చైన్ మేనేజ్‌మెంట్, వేర్ హౌస్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో స్కాలర్‌షిప్‌తో కూడిన ప్లేస్‌మెంట్ సహకారాన్ని అందిస్తోంది. ఐటీఐ, డిగ్రీ, పీజీ ఉన్న 19 నుంచి 28 సంవత్సరాల మధ్య వయసున్న పేద యువతీ యువకులకు స్కాలర్‌షిప్‌తో కూడిన ప్లేస్‌మెంట్ సదుపాయం ఉందని, సెప్టెంబర్ నెల చివరి వారంలో ప్రారంభమయ్యే కొత్త బ్యాచ్‌లో చేరే ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తులను ఎర్రగడ్డ రైతుబజార్ (మెట్రో పిల్లర్ నంబర్ ఏ 980) ఎదురుగా సెయింట్ థెరిస్సా చర్చి కాంపౌండ్‌లోని టెక్ మహేంద్ర స్మార్ట్ అకాడమీ ఫర్ లాజిస్టిక్స్ కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు 7337332606లో సంప్రదించాలని ప్రాజెక్ట్ మేనేజర్ దీప్తి కోరుతున్నారు.